క్లుప్తంగా

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సారథ్యంలో వచ్చే నెల 4, 5 తేదీల్లో నిర్వహించే చలోఢిల్లీ కార్యక్రమం పోస్టర్లను ఆదివారం మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకులు బొమ్మ రాజేశ్వరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రామ్మూర్తి, రఘుబాబు, రమణయాదవ్, పుల్లయ్య, సుగుణ, రమణకుమార్, మహేష్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, వరప్రసాద్, నరసింహరావు, పాపారావు పాల్గొన్నారు.

పురోహితులకు భగవద్గీత పుస్తకాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని సుమారు 200 మంది పురోహితులకు కేఎల్ఆర్ ఫౌండేషన్ ద్వారా భగవద్గీత పుస్తకాలను ఆదివారం అందజేసినట్లు కేఎల్ఆర్ చైర్మన్ బానోత్ కీమా తెలిపారు. ఆత్మ డైరెక్టర్ భూక్య రాంబాబుతో పాటు చంద్రకాని లింగారావు, మరిగంటి భార్గవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

తిరుమలాయపాలెం: అమరుల ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు పుసులూరి నరేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని తెట్టెలపాడులో పుసులూరి రామయ్య సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. రామయ్య నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు పోరాడాలన్నారు. శివలింగం, సి.వై పుల్లయ్య మండల కార్యదర్శి కమ్మకోమటి నాగేశ్వరరావు, గొడుగు నాగేశ్వరరావు, ఎంపీటీసీ ఏపూరి నాగేశ్వరరావు, వెంకన్న పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలు సాగించనున్నట్లు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వెంకటరాజ్యం తెలిపారు. నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో పిట్టల మల్లయ్య అధ్యక్షతన ఏఐటీయూసీ, ఇఫ్టు ఆధ్వర్యాన ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వెంకటరాజ్యం, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు ఆవుల అశోక్ మాట్లాడారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇఫ్టూ, బీఆర్ఎస్ యూనియన్లు జేఏసీగా ఏర్పడి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై ఐక్యపోరాటాలు సాగించనున్నట్లు తెలిపారు. నాయకులు సింగు నరసింహారావు, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మీనారాయణ, రాందాస్, అప్పారావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 5వ డివిజన్ బాలాజీనగర్‌లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై ఈనెల 20న సాక్షిలో వచ్చిన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ప్రాంతాన్ని విద్యుత్‌శాఖ డీఈ రామారావు, ఏడి సంజయి కుమార్, ఏఈ ఆర్ భాస్కరరావులు సందర్శించారు. తక్షణ మరమ్మతులుగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసి ఫీజుబాక్స్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచడానికి అంచనాలు పంపినట్లు మంజూరురాగానే పనిచేస్తామని తెలిపారు. దీనికి అయ్యే మొత్తం ఇవ్వడానికి 6వ డివిజన్ కార్పొరేటర్ నాగండ్ల కోటి ముందుకు వచ్చినట్లు తెలిపారు.

సృజనాత్మకతకు స్వేచ్ఛ ఉండాలి



ప్రసేన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: సృజనాత్మకతకు స్వేచ్ఛ ఉండాలని.. తద్వారా మంచి రచనలు వెలుగులోకి వస్తాయని సాహితీవేత్తలు తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన ప్రసేన్‌ను హాసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్(హెచ్ఆర్సీ) ఆధ్వర్యాన ఖమ్మంలో ఆదివారం రాత్రి సన్మానించారు. హెచ్ఆర్సీ అధ్యక్షుడు తోట సుభాషిణి అధ్యక్షతన సభలో తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి ఆనందాచారి, జిల్లా కన్వీనర్ పోతగాని సత్యనారాయణ, ఖమ్మం నగర ఏసీపీ పీ.వీ.గణేష్, కవి మారుతి రవి మాట్లాడారు. శ్రీనివాస్ సూఫీ, ఫణి మాధవి, షుకూర్, కట్టా శ్రీనివాస్‌రావు, రౌతు రవి, ఇబ్రహీం, నిర్గున్, తాళ్లూరి రాధ, నవజీనప్రియ పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	బలగం
సాయిరాం	జాన్ విక్ చాప్టర్ 4
ఆదిత్య	కబ్జా
శ్రీనివాస	దాస్ కా దమ్కీ
సుందర్	రంగమార్తాండ

- ఖమ్మం గాంధీచౌక్

రోడ్డు ఎక్కాలంటే భయం భయం

జనావాసాల్లోనే రోడ్ల వెంట భారీ వాహనాలు

- లారీ డ్రైవర్లు, సిబ్బంది ప్రవర్తనతో బెంబేలు
- మద్యం మత్తులో ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలు
- పగలైనా నడవాలంటే ఇబ్బందిపడుతున్న మహిళలు



ఏదులాపురం కాలనీ సమీపంలో రోడ్డుపై ఆగిన లారీలు

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డు ఏరియాలో జనావాసాల్లో లారీలు, ఇతర భారీ వాహనాలు నిలుపుతుండడంతో స్థానిక కాలనీల వాసులు ఇబ్బంది పడుతున్నారు. అటు సూర్యాపేట, హైదరాబాద్, ఇటు వరంగల్‌కు వెళ్లే వాహనాలకు తోడు ఇంకో ఖమ్మం వచ్చిన లారీలను ఇక్కడ గంటల తరబడి ఆపేస్తున్నారు. ఇంతవరకు ఫర్వాలేదు కానీ లారీల హారన్లు.. డ్రైవర్లు, క్లీనర్ల అరుపులు, కేకలు.. మద్యం మత్తులో చేసే అసాంఘిక కార్యకలాపాలతో స్థానికులు రహదారిపైకి రావాలంటేనే జంకుతున్నారు. రాత్రి పూట మాటేమో కానీ పగలైనా సరే మహిళలు రోడ్డుపైకి రావాలంటే ఒకటి, రెండు సార్లు ఆలోచించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

గంటల తరబడి ఇక్కడే..

లారీలు, లారీల సిబ్బంది వ్యవహరిస్తున్న ప్రవర్తనతో క్రాస్ రోడ్డు సమీపంలోని వెంపటినగర్ తదితర కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. వెంపటినగర్‌కు సమీపంలో ఉన్న కాలనీ వాసులు నిత్యం తమ ఇళ్ల నుండి బయటకు వెళ్లాలంటే ఈ వాహనాలను దాటుకుని వెళ్లాల్సిందే. కానీ పగలు కూడా ఒంటరిగా మహిళలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇతర రాష్ట్రాల నుండి భారీ లారీలు కాలనీకి సమీంలోకి వచ్చి ఇక్కడ నిలుపుతారు. రాత్రి వేళల్లో లారీ డ్రైవర్లు , సిబ్బంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అలాగే, సమీపంలోని వెంచర్లలో రాత్రి వేళల్లో ఆకతాయిలు, లారీ డ్రైవర్లు మద్యం తాగడం, ఘర్షణలకు దిగడం పారిపాటిగా మారింది. మద్యం మత్తులో కేకలు వేయడం, అరుపులు కేకలతో ఈప్రాంతమంతా భయంకరంగా ఉంటోంది. ఏదైనా చెబుదామంటే బయట రాష్ట్రాల నుండి వచ్చేవారు కావడంతో అర్థం కాక జనం సతమతమవుతున్నారు. గతంలో ఇదే సమస్యపై లారీ డ్రైవర్లను మందలించిన వారిపై దాడులకు పాల్పడిన సంఘటనలు జరిగాయి. ఇక ఏదులాపురం స్టేజీ నుండి నాయుడుపేట బైపాస్ వరకు రాత్రి వేళల్లో పలు అసాంఘిక కార్యకలాపాలు నిత్యకృత్యమయ్యాయి. బైపాస్ రోడ్డులోని పెట్రోల్ బంక్‌ల సమీపంలో ఓ కిల్లీ కొట్టులో గంజాయి అమ్ముతూ మహిళ పోలీసులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. గతంలో గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నారనే కారణంతో ముగ్గురు యువకులను నల్లగొండ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంటే మొత్తం మీద బైపాస్ రోడ్డు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనేది తెలుస్తుండగా.. సమీప కాలనీల వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై రూరల్ పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడంలేదని.. ఇకనైనా అధికారులు స్పందించి నివాసాల నడుమ లారీలు ఆపకుండా చూడడంతో పాటు రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

లారీ డ్రైవర్ల తీరుతో ఇబ్బందులు

రాత్రి వేళల్లో మా కాలనీ సమీపాన లారీలు ఆపడం , అక్కడి వారు మద్యం తాగిన చేస్తున్న గోలతో మహిళలు ఇంటి నుండి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఖమ్మంలో పనులు ముగించుకొని రాత్రి వేళ ఈ ప్రాంతం మీదుగానే కాలనీకి వెళ్లాలి. కానీ డ్రైవర్లు, ఆకతాయిల ప్రవర్తనతో ఆందోళనకు గురవుతున్నాం.

– శ్రీకాంత్, వెంపటినగర్ కాలనీ

రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచాలి

ఈ ప్రాంతంలో రాత్రి వేళ పలువురు మద్యం సేవించి అరుపులు, కేకలతోఅసలు ఏం జరుగుతుందో అర్థం కాక భయపడాల్సి వస్తుంది. అర్ధరాత్రి దాకా కాలనీ పక్కనే ఉన్న వెంచర్‌లో గుంపులు గుంపులుగా బండ్లపై వచ్చి తాగి ఘర్షణలకు దిగడం పరిపాటిగా మారింది. పోలీసులు స్పందించి రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచాలి.

– రామయ్య, బైపాస్ రోడ్

సంప్రదాయ సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలి



పంచాంగ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రామానుజ జీయర్ స్వామి తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ వైష్ణవ సేవా జిల్లా సంఘం ఆధ్వర్యంలో స్థానిక త్రీటౌన్‌లోని పీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పరమహంస పరివాజకులు, భాష్యకార్య సిద్ధాంత పీఠాధిపతి త్రిదండి శ్రీరామచంద్ర రామానుజజీయర్ స్వామి ఆదివారం ఉగాది పంచాగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి మాట్లాడుతూ.. వైష్ణవ సేవా సంఘం సంప్రదాయ సేవలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాలోని వైష్ణవి సేవా సంఘం 21 మంది అనుభవజ్ఞులకు ఉగాది పురస్కారాలను అందించి సత్కరించారు. గతేడాది పదో తరగతిలో 10/10, 9.8 పాయింట్లు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో కేఐఆర్ ఫౌండేషన్ బాణోత్ కీమా, రాంబాబు ఆధ్వర్యంలో 200 మందికి భగవత్ గీతా పుస్తకాలను పంపిణీ చేశారు. శ్రీ వైష్ణవి సేవా సంఘం జిల్లా అధ్యక్షులు శేషభట్ట రఘునాథాచార్య స్వామి, ప్రధాన కార్యదర్శి మరిగంటి భార్గవాచార్యులు, ఉపాధ్యక్షుడు నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంక్షేమ సంఘం మహాసభ



చైర్‌పర్సన్ శ్వేతను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట మహాసభ సోమవారం టీటీడీసీ భవన్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ దోరేపల్లి శ్వేతకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, రాఘవులు, బీసీ జేఏసీ చైర్మన్ పాల్వంచ రామారావు, కిషన్‌నాయక్, సత్యనారాయణ, భిక్షం, హుస్సేన్, వెంకటేశ్వర్లు, ఆనంద్‌కుమార్, ప్రభాకర్, పద్మారావు, శ్రీనివాసరావు, వేణు, సురేందర్, లింగయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

మిత్రుడికి చేయూత

తిరుమలాయపాలెం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఆర్థిక భారంతో ఉన్న స్నేహితుడికి ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందించారు. మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన ఎల్.ప్రవీణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలవ్వగా తనతో పదో తరగతి చదివిన మిత్రులు రూ.22 వేలు ఆర్థిక సాయం అందించారు. పూర్వ విద్యార్థులు వెంకటేశ్వర్లు, కుసుమ సురేష్, వేగినాటి రంగారావు, గోకినపల్లి ఉషయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మబిక్షం చరిత్రను పాఠంగా చేర్చాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల హక్కుల కోసం పోరాటం చేసిన మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మబిక్షం జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసరి శ్రీరాములు డిమాండ్ చేశారు. ధర్మబిక్షం వర్ధంతి సందర్భంగా గిరిప్రసాద్ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగు నరసింహారావుతో కలిసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించాక శ్రీరాములు మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు తోట రామాంజనేయులు, జక్కా నాగభూషణం, పంది లింగయ్య, సంపెట లోకేష్, సురభి శ్రీను, దూసరి గోపాల్‌రావు, బంధం నాగేశ్వరావు, బండి పుల్లయ్య, పరసగాని లక్ష్మణ్‌గౌడ్, దూసరి కళ్యాణ్, భూమ్మగాని భద్రయ్య, రావూరి కొండయ్య, వెంకటరాజం, పిట్టల మల్లయ్య, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయుర్వేద వైద్యులు పాములపర్తి రామారావు ఆధ్వర్యాన జర్నలిస్టుల కోసం ఆదివారం వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని ఆర్‌జేసీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ, ఏపీఆర్వో వల్లోజి శ్రీనివాసరావు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాం నారాయణ ప్రారంభించి మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావుతో పాటు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, కనకం సైదులు, గోగిరెడ్డి శ్రీనివాసరావు, మహేందర్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి మహా పుష్పాభిషేకం



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీలోని శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి దేవాలయ 19వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం మహాపుష్పాభిషేకం నిర్వహించారు. 8 క్వింటాళ్ల 18 రకాల పూలతో పుష్పాభిషేకం నిర్వహించారు. మహాపూర్ణాహుతి, అనంతరం అన్నదానం కార్యక్రమం చేశారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మేయర్ నీరజ, కార్పొరేటర్లు దండాజ్యోతిరెడ్డి, నాగండ్లకోటి, పల్లెబోయిన చంద్రం, అల్లిక అంజయ్య, తొట్టి కొమరయ్య పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మేకల వీరన్న, గుగులోత్ మణికంఠ, గౌరవాధ్యక్షుడు జెల్లి కొండలరావు, ప్రచార కార్యదర్శి పురం తిరపతయ్య, కార్పొరేటర్ కార్యవర్గ సభ్యుడు దండా జ్యోతిరెడ్డి, బొల్లి కొమరయ్య, సత్యం, సుబ్బాచారి, గణేష్, సూర్యం, మల్సూర్, వీరబాబు, అంజయ్య, చంద్రయ్య, వెంకన్న, వీరయ్య, విజయ, సాలమ్మ, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఠాక్రేకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న నాయకులు

కూసుమంచి: వైరాలో ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ ఆధ్వర్యాన జరిగిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పాల్గొనేందుకు టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావీద్, రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి వచ్చారు. వీరికి జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలకగా, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మానుకొండ రాధాకిషోర్, రామసహాయం మాధవీరెడ్డి, ఎడవెల్లి కృష్ణ, కొరివి వెంకటరత్నం, పైడిపల్లి కిషోర్, లెనిన్, నరేంద్ర, ముస్తఫా, వెంకట్రామయ్య, మధుసూదన్ రెడ్డి, కలీం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కవి 'కట్టెకోల'కు సత్కారం

ఖమ్మం గాంధీచౌక్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా కేంద్రంలో ఆదివారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాలను, కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన కవి, సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోల చిన నర్సయ్యను సన్మానించారు. సమ్మేళనంలో మానవత్వాన్ని పరిమళించు అనే శీర్షికపై రాసిన కవితను ఆలపించినందుకుగాను శాలువా కప్పి, మెమొంటో అందించి సత్కరించారు. సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాతూరి అన్నపూర్ణ, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జీవీ పూర్ణచంద్, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అభినందించారు.

రక్తదాన శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎఫ్ఓ

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పరిధిలోని ఆదిత్యనగర్2లో ఆదివారం సానియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎఫ్ఓ సిద్దార్థ విక్రమ్‌సింగ్ ప్రారంభించి మాట్లాడుతూ.. అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని బతికిచ్చడానికి రక్తం ఎంతో విలువైందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, సంస్థ అధ్యక్షుడు ఊరడి విజయ్‌రెడ్డి, వి.సుదర్శన్‌రెడ్డి, పొన్నెకంటి నర్సింహారావు, గడ్డం వీరబాబు, ఉమాకర్, అన్వేష్, ఏర్పుల జయప్రసాద్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోడేదూడ వితరణ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం టేకులపల్లికి చెందిన ఇందిరానగర్ బాలగణపతి ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బాజిన్ని వీరయ్య, తిరుపతిరావు తమ ఇంట్లో పెరిగిన కోడేదూడను సూర్యాపేట జిల్లా గండ్రాయిలో రామాలయ ప్రతిష్ఠాపన సందర్భంగా వితరణగా అందజేశారు. ఈ మేరకు ఆలయ నిర్మాణ బాధ్యులు ఆదివారం టేకులపల్లిలో దాతలను సన్మానించారు.

ఎంపీ నామతో రైతుల భేటీ



పరామర్శిస్తున్న ఎంపీ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: విజయవాడ – ఖమ్మం గ్రీన్ హైవే భూసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రైతులు ఎంపీ నామ నాగేశ్వరరావును కోరారు. ఈమేరకు మధిర, ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల చుట్టుపక్కల గ్రామాల రైతులు ఆదివారం ఖమ్మంలో ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా గ్రీన్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారు తమ సమస్యలను వివరించారు. దీంతో ఎంపీ స్పందిస్తూ.. కేంద్ర మంత్రితో పాటు సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కరిస్తానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, రైతులు సామినేని పరమేశ్వరరావు, గురువయ్య, భుజంగరావు, నరసింహారావు, శివనారాయణ, సింహాద్రి వెంకయ్య, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఎంపీ పర్యటన

ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మంలో పర్యటించారు. ఈ సందర్భంగా నెహ్రూ నగర్‌లోని తన స్వగృహంలో రూ.9 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆతర్వాత పలువురి ఇళ్లలో జరిగిన శుభకార్యాలకు హాజరైన ఎంపీ, అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబాలను పరామర్శించారు. అనంతరం బీఆర్ఎస్ టూ టౌన్ పార్టీ కార్యకర్తల సమ్మేళనంలో పాల్గొన్న ఎంపీ మాట్లాడారు.

దాతల సాయం అభినందనీయం



మైక్ సెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కూసుమంచి: కూసుమంచి శివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన మైకులను ఆదివారం పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఆలయ కమిటీ డైరెక్టర్లు నాగిరెడ్డి పునీత రవీందర్ రెడ్డి, అర్వపల్లి వెంకట్, నెల్లూరి సత్యం రూ.2 లక్షల వ్యయంతో 20 మైకులు, సౌండ్‌సిస్టంను సమకూర్చగా ఎమ్మెల్యే వాటిని ప్రారంభించారు. దాతలను ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ కొక్కిరేణి వీరస్వామి, ఈఓ శ్రీకాంత్, డైరెక్టర్లు రామకృష్ణ, నాగయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వేముల వీరయ్య పాల్గొన్నారు.

మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభం..

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లి, గోళ్లపాడులో ఆదివారం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్‌క్యాంప్‌ను ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, సర్పంచ్ బి.నాగరత్నం, సుడా డైరెక్టర్ గూడా సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కూసుమంచి: కూసుమంచిలోని ప్రగతి విద్యాలయంలో 1995 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. గట్టుసింగారం గ్రామానికి చెందిన నెల్లూరి ఆనందరావు నివాసంలో తమతమ బాగోగులను, యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ ఆలీ, చావా కిరణ్, మునిగంటి రాములు, నాగిరెడ్డి రవీందర్‌రెడ్డి, దాసు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం వన్‌టౌన్ నిజాంపేటకు చెందిన బండి రమేష్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫారసుతో సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం మంజూరైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.ప్రకాష్, కొండల్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

జనచైతన్య యాత్ర జయప్రదం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యాన చేపట్టిన జన చైతన్య యాత్రను జయప్రదం చేసిన జిల్లా ప్రజలకు సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. యాత్ర ఈనెల 21న ఏన్కూరు వద్ద జిల్లాలోకి ప్రవేశించగా, 25వ తేదీ వరకు 350 కి.మీ. మేర జిల్లాలో యాత్ర, సభలు జరిగాయని పేర్కొన్నారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయటం సరికాదని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ అన్నారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యాన ఖమ్మం కొత్తబస్టాండ్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు సైదేశ్వరరావు, గంగాధర్, ఉపేందర్, తూమాటి నవీన్‌రెడ్డి, బొల్లం మహేష్ యాదవ్, కిరణ్, వెంకటరమణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రజకులకు పెద్దపీట

ఖమ్మం మామిళ్లగూడెం: రజకులకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని సమైఖ్య రజకసంఘం సభ్యులు అన్నారు. ఆదివారం నగర అధ్యక్షుడు కణతాల నర్సింహరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కుల లక్ష్మయ్య మాట్లాడుతూ... నగరంలో అధునాతన ధోబీ ఘాట్ నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు కేటాయించడంపై రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రేగళ్ల కొండలు, జక్కుల వెంకటరమణ, వీరబాబు, పంతంగి రవికుమార్, వెంకట్, శ్రీను, భద్రయ్య, యాలాద్రి, అప్పారావు, వెంకటేశ్వర్లు, రామారావు, శేషు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, సంపత్, ఉపేందర్ పాల్గొన్నారు.

అగ్రి ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించాలి

నేలకొండపల్లి: ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్‌లో పనిచేసే ఎంప్లాయిస్ సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మిరియాల సంపత్, ప్రధాన కార్యదర్శి పోటు శ్రీధర్‌లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం వద్ద ఆదివారం అసోసియేషన్ సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. గాదె నరసింహారావు(అధ్యక్షుడు), రావెళ్ల సురేష్(ఉపాధ్యక్షుడు), ఎరసంగి శ్రీనివాసరావు (కోశాధికారి), తుమ్మలపల్లి సాయి(ఆర్గనైజింగ్ సెక్రటరీ) మాలోత్ హనుమ, భూక్యా ఉపేందర్, బోయిన బ్రహ్మంలను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం



తలంబ్రాలు కలుపుతున్న భక్తులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని భక్త రామదాసు ధ్యాన మందిరంలో జరిగే శ్రీరామనవమి కల్యాణానికి తలంబ్రాలను భక్తులు సిద్ధం చేశారు. భక్తులు గోటితో తయారు చేసిన బియ్యం ఆదివారంతో పూర్తి కావటంతో మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పసుపు కలిపి భద్రాచలం దేవస్థానం అందించే తలంబ్రాలతో పాటు, సిద్ధం చేశారు. పూజారి సౌమిత్రి రమేష్ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు చేపట్టారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం..



మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని ప్రధాన రోడ్డులో సీసీ రోడ్డు మార్జిన్ యమడేంజర్‌గా ఉంది. గ్రామ సెంటర్ నుంచి పాఠశాల వైపునకు వెళ్లే సీసీ రోడ్డును ఆనుకొని డ్రెయినేజీ వరకు సమాంతరంగా లేకపోవడంతో పెద్ద గుంతలా ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ రోడ్డులో రఘునాథపాలెంతో పాటు, చింతగుర్తి, గణేశ్వరం గ్రామాల ప్రజలకు, పాఠశాల విద్యార్థులు, సాయి మందిరానికి వచ్చే భక్తులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రమాదాల బారిన పడి నష్టం జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– రఘునాథపాలెం

ప్రశ్నించాల్సిన అధికారి : పి.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి
సెల్ నంబర్ :9490183141